ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

జయశంకర్ 5 భూపాలపల్లి

మంగళవారం 17 డిసెంబరు 2024



భూమిలేని పేదలెందరో?



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

భూమిలేని పేదలకు ప్రభుత్వం రూ.12వేల ఆర్థిక సాయానికి సన్నాహాలు చేస్తోంది. రెండు విడతల్లో పేదలకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే భూమిలేని పేదలను ప్రభుత్వం ఎలా గుర్తిస్తుందనేది ఉత్కంఠగా మారింది. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి అనేక సర్వేలు నిర్వహించినా భూమి లేని నిరుపేదల వ్యవసాయ కూలీల గురించి ప్రత్యేకంగా సర్వే ఎప్పుడూ నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో భూమిలేని పేదల గుర్తింపు ప్రక్రియపై పలు అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల గ్రామీణ ఉపాధిహామీ జాబ్‌కార్డులు ఉన్నాయి. అయితే వీటి ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారా? లేక ప్రస్తుతం రైతుభరోసా తీసుకుంటున్న వారు కాకుండా.. మిగతా వారికి సాయాన్ని అందిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. వ్యవసాయ కూలీలకు ఇచ్చే సహాయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది.

కూలీలకు ఫస్ట్.. ఆ తరువాతే రైతుకు భరోసా

కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రైతుభరోసాను ప్రకటించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం కింద ఎకరాకు యాసంగి, వానకాలం పంటలకు రెండు విడతల్లో రూ.10వేల ఆర్థిక సాయాన్ని రైతులకు అందించింది. అయితే తాము అధికారంలోకి వస్తే రైతుబంధు పథకం స్థానంలో రైతుభరోసా పథకాన్ని అమలు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. భరోసా ద్వారా రైతులకు ఎకరాకు రెండు విడతల్లో రూ.15వేల పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. అలాగే కౌలు రైతులకు కూడా ఇదే మొత్తాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఇక వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు గతేడాది డిసెంబరు 7న సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత యాసంగి పంటలకు సంబంధించి పాత పద్ధతిలోనే రైతులకు యాసంగి పంటకు ఎకరానికి రూ.5వేల చొప్పున సాయాన్ని అందించారు. అయితే వానాకాలం పంటలకు, ప్రస్తుతం ప్రారంభమైన రబీ పంటకు కాంగ్రెస్ ఇచ్చిన రైతు భరోసా పథకం కింద ఎకరానికి రూ.15వేల చొప్పున ఇవ్వాల్సి ఉంది. అయితే భరోసా పథకాన్ని సంక్రాంతి నుంచి అమలు చేస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. రైతు భరోసాకంటే ముందే వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల ఆర్థిక సాయాన్ని అందించాలని నిర్ణయించింది. రెండు విడతల్లో భూమిలేని వ్యవసాయ కూలీలకు రూ.12వేల సాయాన్ని అందించనున్నారు. తొలి విడత రూ.6వేల సాయాన్ని

మిగతా 7వ పేజీలో...



వ్యవసాయ కూలీలకు ఆర్థిక భరోసా అందజేతకు ప్రభుత్వం సన్నాహాలు

- ఏటా రూ.12వేలు ఇవ్వనున్న రాష్ట్ర సర్కారు
- తొలి విడతగా ఈనెల 28న రూ.6వేలు జమ చేయనున్నట్టు ప్రకటన
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 7.35లక్షల మందికి జాబ్‌కార్డులు
- భూమిలేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే చేయని ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8,89,787 మందికి రైతుభరోసా
- ఏటా వ్యవసాయ కూలీలు, రైతు భరోసాకు రూ.30వేల కోట్లు ఖర్చు

జిల్లా.. లబ్ధిపొందిన రైతులు	వరంగల్	హనుమకొండ	జనగామ	మహబూబాబాద్	భూపాలపల్లి	ములుగు	మొత్తం
	1,54,822	1,45,044	1,79,735	2,14,685	1,16,171	79,330	8,89,787

గత యాసంగిలో రైతు భరోసా లబ్ధిపొందిన ఉమ్మడి జిల్లా రైతులు..

చదువుతోపాటు

క్రీడల్లోనూ రాణించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కలెక్టర్ రాహుల్ శర్మ కాంక్షించారు. సీఎం కప్ క్రీడా పోటీలను జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ క్రీడా మైదానంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. గ్రామ స్థాయి నుంచి క్రీడా కారులను ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. క్రీడాకారులు గ్రామ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడల ద్వారా చురుకుదనం ఉంటుందని తద్వారా విద్యలో సైతం రాణిస్తారని అన్నారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ గెలుపు ఒక మధుర అనుభూతి అని, ఓటమి చెందిన వారు నిరాశచెందకుండా ముందుకు పోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, స్పోర్ట్స్ అధికారులు పాల్గొన్నారు.

జ్వరంతో బాలుడి మృతి



మేఘనాథ్ (ఫైల్)

వాజేడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జ్వరంతో బాలుడి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన కొప్పుల ప్రశాంత్, నాగలక్ష్మి దంపతుల కుమారుడు కొప్పుల మానస్ మేఘనాథ్ (3) నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అతడి ఆరోగ్యం విషమించింది. దీంతో భద్రాచలంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం ఖమ్మం తీసుకెళ్తుండగా మార్గమధ్యలో కొత్తగూడెం వద్ద బాలుడి కదలికలు ఆగిపోయాయి. దీంతో అక్కడి వైద్యుడికి చూపించగా బాలుడు మృతి చెందాడని నిర్ధారించారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున బాలుడి శరీరం వేడిగానే ఉందని, కనరెప్పలు ఆడిస్తున్నాడని కొంత మంది గమనించడంతో మళ్లీ అతడిని ఏటూరునాగారం వైద్యశాలకు తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ధ్రువీకరించారు.

మేడారంలో ముందస్తు మొక్కులు



వనదేవతల గద్దెలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాడ్వాయి మండలం మేడారంలో వనదేవతలు సమ్మక్క-సారలమ్మ సన్నిధిలో సోమవారం సందడి నెలకొంది. మినీ జాతరకు ముందుగానే భక్తులు తల్లుల వద్దకు చేరుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో సుమారు 10వేల మంది పైగా భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం, చీరె, సారెలు, యాట మొక్కులు సమర్పించుకున్నారు.

చిన్నారులపై పిచ్చి కుక్క దాడి



గాయపడిన వర్షిత్

చిట్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒడితల, పాశిగడ్డతండా గ్రామాల్లో పిచ్చి కుక్క దాడిలో ఇద్దరు చిన్నారులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటున్న జరుపుల వర్షిత్‌పై దాడి చేసిన పిచ్చి కుక్క పక్క గ్రామంలోని కుందుకూరి రాహుల్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపర్చింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక పీహెచ్‌సీ, భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొద్ది నెలలుగా గ్రామాల్లో కుక్కల దాడులు జరుగుతున్నాయి. దీంతో పదుల సంఖ్యలో ప్రజలు గాయపడినా అధికారులు, ప్రజాప్రతినిధులు నివారణ చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తమవుతోంది.

దంతాలపల్లిలో ముగ్గురికి గాయాలు



ఆయా దుర్గమ్మ కాలుపై కుక్క కరిచిన గాయాలు

కాటారం (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని చిదినేపల్లి గ్రామపంచాయతీ పరిధి దంతెలపల్లిలో సోమవారం వీధి కుక్క చేసిన దాడిలో అంగన్‌వాడీ ఆయాతోపాటు మరో ఇద్దరు గాయపడ్డారు. ఆయా దుర్గమ్మ వంట చేసే క్రమంలో కరివేపాకు తెంపుకొని వస్తుండగా కుక్క దాడి చేసి గాయపర్చింది. ఇదే క్రమంలో మహారాష్ట్ర నుంచి పత్తి ఏరడానికి దంతాలపల్లికి వచ్చిన కూలీలు మొండయ్య, సారక్కపై కూడా కుక్క దాడి చేసి గాయపర్చింది. ఈ వీధి కుక్కల దాడిలో గత 10రోజులుగా సుమారు 20మంది గాయపడ్డారని, పంచాయతీ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు అంటున్నారు. వీధి కుక్కలను నియంత్రించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

తాడ్వాయి అడవుల్లోకి పెద్దపులి



భద్రాద్రి జిల్లా వైపు నుంచి మళ్లీ రాక

7

పెద్దపులి పాదముద్ర

గజ.. గజ..

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో తీవ్రమైన చలి
- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- వణుకుతున్న జనం



వాజేడులో చలిమంట కాగుతున్న యువకులు

వరంగల్‌సిటీ / ములుగు , డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): చలి పంజా విసురుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కొద్ది రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతున్నాయి. గత మూడునాలుగు రోజులుగా చలి తీవ్రత పెరగడంతో జనం వణుకుతున్నారు. వృద్ధులు, పిల్లలు, శ్వాసకోశ సంబంధ సమస్యలు ఎదుర్కొంటున్న వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పగటి ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల సెల్సియస్ నమోదవగా.. రాత్రిపూట 12 డిగ్రీల సెల్సియస్ నమోదయ్యాయి. ఇక ఉదయమైతే 9గంటల వరకు పొగ మంచు కురుస్తోంది. పనులపై బయటకొచ్చే వారు, విద్యార్థులు, రైతులు స్వెట్టర్లు వేసుకుంటున్నారు. మరీ ముఖ్యంగా ములుగు ఏజెన్సీ వాసులు వణికిపోతున్నారు. నాలుగురోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. పగటిపూట గరిష్ఠంగా 26డిగ్రీలతో వాతావరణం పొడిగా ఉంటున్నా అర్ధరాత్రికి ఆ ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతూ 11 నుంచి 13డిగ్రీలు నమోదవుతోంది. గోదావరి పరివాహకంలోని ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం మండలాల్లో గోదావరి నదీతీరం, అభయారణ్యం ప్రభావంతోనే చలి తీవ్రంగా ఉంటోంది.

ఉమ్మడి జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌డిగ్రీల్లో)

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ములుగు	28	11
వరంగల్	28	12
హనుమకొండ	27	12
భూపాల్‌పల్లి	28	12
జనగాం	28	13
మహబూబాబాద్	28	13

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

ములుగు కలెక్టర్ దివాకర



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్.దివాకర ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజల నుంచి 27 వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందజేసిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. వినతులను పెండింగ్‌లో పెట్టకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో గోపాల్‌రావు, సీపీవో ప్రకాశ్, డీసీవో సర్దార్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తుల రవి, డీఈవో పాణిని, డీసీఎస్‌వో షాఫైజల్ హుస్సేన్, డీఎండీసీఎస్‌వో రాంపతి, ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ లక్ష్మణ్‌నాయక్, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, డీడబ్ల్యూవో శిరీష, ఎల్‌డీఎం జయప్రకాష్, ఇతరశాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూపు -2 పరీక్షలు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రూపు -2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. రెండో రోజు సోమవారం 4,423 మంది అభ్యర్థుల పరీక్షలు రాయాల్సి ఉండగా 2,099 మంది మాత్రమే హాజరయ్యారు. ఇంకా 2,324 మంది గైర్హాజయ్యారు. మొత్తంగా 47 శాతం మంది మాత్రమే హాజరైనట్లు అధికారులు తెలిపారు.

సగం మంది గైర్హాజరు

ములుగు (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిశాయి. ఈ పరీక్షలకు అభ్యర్థులలో సగం మంది మాత్రమే హాజరయ్యారు. మొదటిరోజు మాదిరిగానే రెండోరోజు 50శాతమే పరీక్షలు రాశారు. తొమ్మిది పరీక్ష కేంద్రాలలో మొత్తం 2,195 మంది పరీక్ష రాయాల్సి ఉండగా రెండోరోజు ఉదయం 1,102 మంది, మధ్యాహ్నం 1,099 మంది హాజరయ్యారు. తొలిరోజు పరీక్షలు రాసిన వారిలో రెండోరోజు 18 మంది గైర్హాజరయ్యారు. బండారుపల్లి మోడల్ స్కూల్‌లోని పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ టీఎస్.దివాకరతోపాటు అదనపు కలెక్టర్ సంపత్‌రావు సందర్శించారు. పరీక్ష ముగిసిన తర్వాత ఓఎంఆర్ షీట్లను జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

సిమెంట్ కంపెనీకి భూ రిజిస్ట్రేషన్‌పై

రైతుల అభ్యంతరం

విచారణకు ఆదేశించిన కలెక్టర్

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్ర జ్యోతి) : పలిమెల శివారులోని 102 ఎకరాలకు పైగా భూములకు ఓ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేయ డంపై అక్కడి రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు విలాస్‌రావు, దండెర రాజేందర్‌తో కలిసి 30మంది రైతులు కలెక్టర్‌కు సోమ వారం ఫిర్యాదు చేశారు. తాము కాస్తులో ఉండి సాగు చేసుకుంటున్న భూములను పలిమెల మండల కేంద్రానికి చెందిన రైతులు కాకుండా ఇతర ప్రాంతా లకు చెందిన కొంతమంది వ్యక్తులు ఓ సిమెంట్ కంపెనీకి రిజిస్ట్రేషన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయంపై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజ బాపు సైతం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో మం త్రి శ్రీధర్‌బాబు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ రాహుల్ శర్మ ఆ భూమికి సంబంధించి విచారణ చేపట్టాలని పలిమెల తహసీల్దార్‌ను సోమవారం రాత్రి ఆదేశించారు. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరగా గతంలోనే ఆ భూములు కొంత మంది వ్యక్తులపై పట్టా చేయబడి ఉన్నాయని, వారు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారని తెలిపారు. ఆ సర్వే నెంబర్లపై ఎలాంటి ఫిర్యాదు లేకపోవ డంతో రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలిపారు. కాగా రైతులు, నాయకుల ఫిర్యాదుతో గంటల వ్యవధిలో కలెక్టర్ విచారణకు ఆదేశించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

- ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- నిందితుల్లో 16 ఏళ్ల బాలుడు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

వివరాలు 6వ పేజీలో

యువకుడి వేధింపులతో

వివాహిత ఆత్మహత్య



స్రవంతి (ఫైల్)

టేకుమట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యువకుడి వేధింపులు తట్టుకోలేక పురుగుల మందుతాగి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లిలో జరిగింది. ఎస్సై ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఉడుత కుమారస్వామి తన కూతురు స్రవంతిని (22) కొత్తపల్లిగోరి మండల కేంద్రానికి చెందిన బైకాని సాయికిచ్చి 2019లో వివాహం చేశాడు. ఈ క్రమంలో టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన 22ఏళ్ల వయసున్న మచ్చ రాకేష్ అనే యువకుడు ఈ నెల 5న కొత్తగోరిపల్లిలోని స్రవంతి ఇంటికి వెళ్లి తనతో రావాలని ఆమెను బలవంతం చేశాడు. గమనించిన స్రవంతి మామ మల్లయ్య రాకేష్‌ను ప్రశ్నించే ప్రయత్నం చేయగా.. మలయ్యపై రాకేష్ దాడి చేసి ద్విచక్ర వాహనంపై వెళ్లిపోయాడు. బయట నుంచి ఇంటికివచ్చిన స్రవంతి భర్త సాయి విషయం తెలుసుకుని ఆమెపై కోపంతో 6వతేదీన ఆశిరెడ్డిపల్లిలో తల్లిగారింట్లో వదిలిపెట్టాడు. ఈ పరిణామాలతో మనస్తాపం చెందిన స్రవంతి ఆదివారం రాత్రి పురుగుల మందుతాగి ఆత్మహత్యాతయత్నం చేసింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. స్రవంతి వివాహానికంటే ముందు రాకేష్ అనే యువకుడు తన కుమార్తెను వేధించేవాడని, ఓ సందర్భంలో తాము రాకేష్‌పై రేగొండ పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టామని మృతిరాలి తండ్రి కుమారస్వామి తెలిపారు. తన కుమార్తె మృతికి కారకుడైన రాకేష్‌పై చర్య తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. మృతురాలికి ఒక బాబు, ఒక పాప ఉంది.



ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘాల నాయకులు

సీఆర్‌టీలో ఆదివాసీలను భర్తీ చేయాలి

ఐటీడీఏ ఎదుట తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నిరసన

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల స్థానంలో కాంట్రాక్ట్ ప్రాతిపాదికన నియమించే సీఆర్‌టీ ఉద్యోగాల్లో అర్హత గల ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేయాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పులిసె బాలకృష్ణ, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘాలు సోమవారం సంయుక్తంగా ఐటీడీఏ కార్యాలయంలో ఎదుట నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 57 ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉన్న అన్ని ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా ఆదివాసీ యువతకే అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఉద్యోగావకాశాల్లో ఆదివాసులకు తీరని అన్యాయం జరుగుతోందని, చట్టాలు సరిగా అమలు నోచుకోకపోవడంతో ఆదివాసులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

షెడ్యూల్డ్ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇంటి పథకం ఆదివాసీల నిరుపేదలకే మొదటి విడతగా కేటాయించాలన్నారు. ఆదివాసీ గ్రామాల్లో వలసలను అరికట్టాలని కోరారు. ఐటీడీఏలోని 29 శాఖల్లోని ఉద్యోగులను ఆదివాసీలనే నియమించాలని కోరుతూ ఈ నెల 23న ఐటీడీఏ ఎదుట నిర్వహించనున్న భారీ ధర్నాను తలపెట్టమని, ఆదివాసు లు విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. అనంతరం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రాకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తుడుందెబ్బ నాయకులు పోడెం బాబు, పాపారావు, యాదయ్య, ఈసం రాజు, నాగేశ్వరరావు, విద్యార్థి సంఘం నాయకులు ఆలం నగేష్, సంతోష్, మహిళా సంఘం నాయకులు సులోచన తదితరులు పాల్గొన్నారు.



సిల్వర్ మెడల్ అందుకుంటున్న విద్యార్థి వంగ సహన్‌గౌడ్

కరాటేలో జాతీయ స్థాయి పతకం

స్టేషన్‌ఘన్‌పూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాత్రి జరిగిన జాతీయ స్థాయి కరాటే టోర్నమెంట్స్‌లో మండల కేంద్రంలోని లయోలా ఉన్నత పాఠశాలకు చెందిన వంగ సహన్ అనే విద్యార్థి జూనియర్ కటాస్ విభాగంలో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించాడు. కరాటే మాస్టర్‌లు పెసరు సారయ్య, శ్రీనివాస్‌లు మాట్లాడుతూ సహన్ ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్ సాధించడం జరిగిందన్నారు. సినీ కొరియోగ్రాఫర్ పీటర్ హైన్ (ఫైట్ మాస్టర్), నేషనల్ కుంగుఫూ దూ ఫెడరేషన్ అధ్యక్షుడు కంతేశ్వర్, ఫైట్ మాస్టర్లు కార్తీక్, రాజుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారని తెలిపారు.

ప్రముఖ ఒగ్గు కళాకారుడు మృతి

బచ్చన్నపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కట్కూరుకు చెందిన ప్రముఖ ఒగ్గు కళాకారుడు చెట్టె ఐలయ్య (75) సోమవారం అనారోగ్యంతో మృతి చెందా డు. నాలుగు దశాబ్దాలుగా ఒగ్గు కథలను అవలీలగా చెబుతూ ప్రాచుర్యం పొందాడు. హైదరాబాద్‌లో జరిగిన అనేక ఉత్సవాలు, పండుగల్లో ఒగ్గు కథలు చెప్పి పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. పాత్రలను గానంతో రక్తి కట్టించేవారు. ఐలయ్య మృతికి చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత వెంకటాచారి, మాజీ ఎంపీపీ బావండ్ల కృష్ణంరాజు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు పుట్ట నర్సింహులు, నేతలు మునిని రాజుగౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు మునిని శ్రీశైలం గౌడ్ పలువురు ఒగ్గు కళాకారులు, గ్రామ ప్రజలు సంతాపం తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.



ఐలయ్య (ఫైల్)

సర్వశిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

» ఎస్‌జీటీలకు ప్రమోషన్ ఇవ్వాలి : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

గోవిందరావుపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత 20ఏళ్ల నుంచి సర్వశిక్షా అభియాన్‌లో కాంట్రాక్టు ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని పస్రాలో టీఎస్ యూటీఎఫ్ మహాసభలు సోమవారం జరగ్గా ఆయ న ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సర్వశిక్షా ఉద్యోగులు అపరిష్కృతంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని, ఉపాధ్యాయులు పెండింగ్ బిల్లులను చెల్లించాలని, సీనియర్ ఎస్‌జీటీలకు పీఎస్ హెడ్‌మాస్టర్ ప్రమోషన్లు కల్పించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఒక తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పోడెం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా రెడ్డి వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షులుగా జె.వెంకటస్వామి, ఎం.అరుణ, కోశాధికారిగా ఎం.వెంకటస్వామి, కార్యదర్శులుగా కె.చంద్రయ్య, లక్ష్మీనారాయణ, ఎస్. పాపారావు, కె.రఘురాం, శివరాం, వై.స్వరూప, జి.బాలాజీ, లక్ష్మారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా లావుడ్యా దశ్రునాయక్, సభ్యులుగా హనుమంతు, సమ్మయ్య, చెంచయ్య, రఘురాం, ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గొప్ప సమ్మారావు, నాయకులు బద్దం వెంకటరెడ్డి, సత్యనారాయణ, సాంబశివరావు, సాంబశివుడు తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

వినతులను సత్వరమే పరిష్కరించాలి

ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా

వెంకటాపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గిరిజన దర్బార్‌లో గిరిజనులు సమర్పించిన వినతులను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆమె గిరిజనుల నుంచి 18 వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వాడగూడెం(జి) పరిధిలోని సర్వేనంబర్ 27లో పదెకరాల భూమిని కొమరంభీం కాలనీకి చెందిన ఆదివాసీ కుటుంబాలకు కేటాయించి హక్కుపత్రాలు అందించాలని గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి దరఖాస్తు అందజేశారు.

చెరుకూరులో సర్వేనంబర్ 106/3లో కోరం కనకయ్య పేరుమీద ఉన్న పట్టాభూమిలో రంగు నాగేశ్వర్‌రావు అనే వలస గిరిజనేతరుడు అక్రమంగా నిర్మిస్తున్న ఇంటి నిర్మాణాన్ని తొలగించాలని చిరుతపల్లికి చెందిన కొర్సా నర్సింహమూర్తి దరఖాస్తు అందజేశారు. వాజేడు మండలం ఘనపురం గ్రామానికి చెందిన శ్యామల లక్ష్మి అటవీ హక్కుల చట్టం ద్వారా పొందిన 2.88సెంట్ల భూమిని సాగుచేసుకునేందుకు బోరు, కరెంటు సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. వెంకటాపురం మండల కేంద్రానికి చెందిన ఎం.రాజేష్, పస్తం సత్యం, సమ్మయ్యలు సీసీరోడ్డు నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా పలు సమస్యలను పరిష్కరించాలని బాధితులు పీవోకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో గిరిజనులు వినతులు సమర్పించారు. గిరిజన దర్బార్‌ను సోమవారం వెంకటాపురం మండలంలో చేపట్టినప్పటికీ ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయంలోనూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజనుల వద్ద నుంచి ఐటీడీఏ ఏవో రాజ్‌కుమార్ వినతులు స్వీకరించారు. మొత్తం ఐదుగురు గిరిజనులు తమ సమస్యలను ఏవో దృష్టికి తీసుకెళ్లారు. ఏటూరునాగారం మండలం చల్పాకలోని పెద్ద చెరువు మత్తడి నీళ్ల పంట పొలాల్లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని, శ్రీ సమ్మక్క- సారలమ్మ మినీ జాతరకు బానాజీ బంధంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆ గ్రామానికి చెందిన సుమతి ఏవోకు వినతి పత్రం అందించారు.

జీవనోపాధి లేక ఇబ్బందులు పడుతున్నానని, ఐటీడీఏ ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలని ఏటూరునాగారానికి చెందిన గుండు కృష్ణారావు ఏవోకు వినతి పత్రం అందించారు. గిరివికాసం పథకం ద్వారా పొలంలో బోర్, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని గోగుపల్లికి చెందిన రైతు భాను చందర్ విజ్ఞప్తి చేశాడు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతి కుమార్, ఏఈ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



గిరిజన దర్బార్‌లో దరఖాస్తును స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా

ఉమ్మడి జిల్లాకు ఫుడ్ సేఫ్టీ అధికారుల రాక

ఐదుగురు అధికారులు, 12 మంది ఉద్యోగుల కేటాయింపు

బాలసముద్రం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అరకొర అధికారులు, సిబ్బంది కొరతతో ఇన్నాళ్లుగా అసలు ఇక్కడ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అనేది ఉందా..? ఉంటే తినుబండారాలపై తనిఖీలు చేసిన దాఖలాలు ఎక్కడా..? అనే ప్రశ్నలు తరచూ ప్రజల్లో రేకెత్తేవి. కొద్ది నెలల క్రితం వరంగల్ మహా నగరంలో ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్‌కు చెందిన హైదరాబాద్ నుంచి వచ్చిన టాస్క్‌ఫోర్స్ అధికారులు పలు హోటళ్లపై జరిపిన దాడుల్లో విస్మయం కలిగించే విధంగా కుళ్లిన మాంసం, కాలం చెల్లిన ఆహార పదార్థాలు, నిషేధిత రంగులు కలపడం లాంటి ప్రజలు తినకూడని, ఆరోగ్యానికి హాని కలిగించే అంశాలు ఎన్నో వెలుగు చూశాయి. ఆహార కల్తీ, నాసిరకం పదార్థాల వినియోగం, విషపూరిత రంగుల నియంత్రణ పర్యవేక్షణ ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలో నూతనంగా 24 మంది ఫుడ్ సేఫ్టీ అధికారులకు పోస్టింగ్‌లు ఇవ్వగా అందులో ఐదుగురు అధికారులను ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించింది. ఇద్దరిని వరంగల్‌ జిల్లాకు, హనుమకొండ, మహబూబాబాద్, జనగామ జిల్లాలకు ఒక్కొక్కరి చొప్పున పోస్టింగ్ ఇచ్చారు. అంతేగాక ఒక్కొక్క జిల్లాకు ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఒక శాంపిల్ కలెక్షన్ ఉద్యోగి చొప్పున 12 మంది ఉద్యోగులను పోస్టింగ్ ఇచ్చారు. నియామకం అయిన అధికారులు, ఉద్యోగులు రేపో మాపో విధుల్లో చేరనున్నారు.

జాతీయ సెమినార్‌కు అశోక్ ఎంపిక



కొడకండ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి చెందిన పోగు అశోక్ జాతీయ విద్యాసదస్సుకు ఎంపికైనట్లు తెలిపాడు. అశోక్ మాట్లాడుతూ జాతీయ విద్యా పరిశోధన సంస్థ న్యూఢిల్లీ వారు నిర్వహిలచే జాతీయ సదస్సుకు రాష్ట్రం నుంచి ఎంపికైనట్లు ఆ సంస్థ నుంచి మెయిల్ వచ్చినట్లు తెలిపారు. ఆయన సమర్పించిన 'హౌటు ఎన్‌హాన్స్ క్రియేటివిటీ అండ్ క్రిటికల్ థింకింగ్ ఇన్ స్టూడెంట్స్ 'అనే పరిశోధన పత్రం ఎంపికైనట్లు తెలిపారు. కాగా, తను ప్రస్తుతం వరంగల్‌లో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2500	2080
పల్లికాయ (సూక)	3500	3000
పల్లికాయ (పచ్చిది)	5250	4500
కందులు	-	-
పెసళ్లు	-	-
పత్తి	7010	5800
పసుపు (కాడి)	-	-
తేజ మిర్చి	12000	9000
తేజ మిర్చి కొత్తది	15516	12000
తేజ ఏసీ	16000	14000
వండర్‌హాట్ ఏసీ	-	-
యూఎస్ 341ఏసీ	13500	11000
యూఎస్ 341కొత్తది	13000	12500
దేశీ ఏసీ	-	-
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	7000	3000

- వరంగల్ వ్యవసాయం

ఎస్‌ఐ కూతురికి

ఆరోగ్యం బాగోలేదంటూ ఫోన్

- » రూ.80 వేలు కొట్టేసిన సైబర్ నేరగాడు
- » ఏఎస్‌ఐనని చెప్పి మినీ బ్యాంకు నిర్వాహకుడిని మోసగించిన వైనం
- » మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో ఘటన
- » ఆలస్యంగా వెలుగులోకి

నర్సింహులపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోలీసుల పేరుచెప్పి సైబర్ నేరగాళ్లు ప్రజలను నిలువునా దోచుకుంటున్నారు. ఎస్‌ఐ కూతురి ఆరోగ్యం బాగోలేదని, సార్‌కు అర్జంట్‌గా రూ.80వేలు అవసరం ఉన్నాయంటూ ఏఎస్‌ఐ అని చెప్పుకొంటూ ఓ వ్యక్తి ఘరానా మోసానికి పాల్పడ్డాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండల కేంద్రంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. నర్సింహులపేట ఎస్‌ఐ మాలోతు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దనాగారం గాంగ్యాతండాకు చెందిన గుగులోతు రమేష్ ఎస్‌బీఐ మినీ బ్యాంకు నిర్వహిస్తూ నర్సింహులపేటలో నివాసం ఉంటున్నాడు. సొంత పని నిమిత్తం ఈనెల 13న హైదరాబాద్‌కు వెళ్లిన రమేష్‌కు సాయంత్రం 6.30గంటల సమయంలో ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను నర్సింహులపేట ఏఎస్‌ఐ బాస్కర్‌రావునని, కొత్తగావిధుల్లో చేరానని పరిచయం చేసుకున్నాడు. ఎస్సై సార్ కూతురుకు ఆరోగ్యం బాగాలేదని, రూ.80వేలు అర్జెంట్‌గా అవసరం ఉన్నాయని, తన వద్ద నగదు ఉన్నాయని, తాను కాల్‌చేసిన నెంబరుకు ఫోన్‌పే చేస్తే తర్వాత వచ్చి డబ్బులు ఇస్తానని చెప్పడంతో నమ్మిన రమేష్ రూ.80వేలు సదరు నెంబరుకు ఫోన్‌పే చేశాడు. డబ్బుల కోసం తిరిగి అదే నంబరుకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. రాత్రి వరకు కూడా డబ్బు పంపకపోవడం, ఫోన్ స్విచ్ఛాఫ్‌లోనే ఉండటంతో అనుమానం వచ్చిన బాధితుడు మరుసటి రోజు నర్సింహులపేట ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి సైబర్ క్రైం విభాగానికి బదిలీ చేశారు. ఈ విషయం ఆనోటా ఈ నోటా పడి సోమవారం వెలుగులోకి వచ్చింది. అయితే ఈ ఘటనపై విచారణ జరుగుతోందని, అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు అడిగినా.. టెలిగ్రామ్ లింకులను పంపినా ఓపెన్ చేయవద్దని ఎస్‌ఐ సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాగా, నర్సింహులపేట మండలంలో రెండు నెలల వ్యవధిలోనే నాలుగు సైబర్ క్రైం కేసులు నమోదవడం పట్ల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి వరంగల్ జిల్లా క్రికెట్ జట్టుకు

మానుకోట విద్యార్థి ఎంపిక

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు మానుకోటకు చెందిన క్రీడాకారుడు బొట్ల ఈశ్వర్ ఎంపికైనట్లు మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి బి.అజయ్‌సారథి రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెల 15న వరంగల్‌లో జరిగిన క్రికెట్ పోటీల్లో పట్టణంలోని 36వ వార్డుకు చెందిన ఈశ్వర్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ఉమ్మడి వరంగల్ జిల్లా అండర్-14 క్రికెట్ జట్టుకు ఎంపికయ్యారని, ఈశ్వర్ ఈనెల 17 హైదరాబాద్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో వేసవి సెలవుల్లో అనేక మంది క్రీడాకారులకు కోచింగ్ ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఈశ్వర్ ఎంపిక పట్ల కోచ్ మెతుకు కుమార్, సభ్యుడు ఆయిలి సంతోష్ హర్షం వ్యక్తం చేశారు.



సాయితేజ

19న ఏకసభ్య కమిషన్ రాక

హనుమకొండ కలెక్టరేట్/వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్ డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ ఈ నెల 19వ తేదీన హనుమకొండకు రానున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ సత్యశారదా దేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్డ్ కులాల ఉప వర్గీకరణపై అధ్యయనం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో బహిరంగ విచారణ నిమిత్తం హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బహిరంగ విచారణ కార్యక్రమం ఉంటుందన్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన ఎస్సీ కులాల సంఘ నాయకులు అధిక సంఖ్యలో బహిరంగ విచారణకు హాజరై తమ వినతులు ఇవ్వాలని, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వినతులు స్వీకరిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

సాయుధ పోరాట యోధుడు..

దర్యానాయక్ కన్నుమూత

- » 107 ఏళ్ల వయస్సులో అనారోగ్యంతో మృతి
- » జనగామ జిల్లాలో విషాదం.. నేడు అంత్యక్రియలు
- » విస్నూర్ దొర ఆగడాలకు ఎదురొడ్డిన దర్యానాయక్

దేవరుప్పుల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): దేశ్‌ముఖ్ ఆగడాలకు ఎదురొడ్డి పోరాడిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు జాటోతు దర్యానాయక్ (107) సోమవారం సాయంత్రం కన్నుమూశారు. జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గంలోని దేవరుప్పుల మండలం ధర్మాపురంలోని జాటోతుతండాకు చెందిన నాయక్ రెండేళ్లుగా అనారోగ్యం(వృద్ధాప్యం)తో బాధపడుతున్నాడు. దర్యానాయక్ భార్య గతంలోనే చనిపోగా, ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు చంద్రభాను నాయక్, చిన్నకుమారుడు పర్శునాయక్ ఉన్నారు. స్థానికంగానే ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కాగా కుమార్తె తారాబాయి ఉన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఉంటున్న దర్యానాయక్ ఆలనాపాలన కూతురు తారాబాయి చూసుకుంటోంది.



దర్యానాయక్ (ఫైల్)

ఇక దర్యానాయక్ అంత్యక్రియలు మంగళవారం జాటోతు తండాలో జరగ నున్నాయి. అంత్యక్రియలకు సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి, రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆదిసాయన్న, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిల్లా తిరుపతిరెడ్డి తదితరులు హాజరు కానున్నారు.

తుపాకీ చేతబట్టి.. దేశ్‌ముఖ్‌ను ఎదిరించి..

దేశ్‌ముఖ్ రాపాక రాంచంద్రారెడ్డి మితిమీరిపోయిన అరాచకాలను దర్యానాయక్ ఎదురొడ్డి తిప్పి కొట్టాడు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తుపాకీ చేతబట్టి అలుపెరగని పోరాటం చేశారు. మహిళల మాన, ప్రాణాలను కాపాడటం కోసం కడవెండికి చెందిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు నల్లా నర్సింహులు గ్రామ రక్షణ దళాలు ఏర్పాటు చేయగా అందులో సభ్యుడిగా చేశారు. దేశ్‌ముఖ్ గుండాలను తరమికొడుతూ వారికి సింహస్వప్నంలా మారాడు. గ్రామంలోని దేశ్‌ముఖ్ గుండాల దాడిలో పదిమంది సజీవ దహనం చేశారు. దర్యానాయక్ అన్న రాసూనాయక్ మొండ్రాయి గ్రామంలో ఎద్దులబండి చక్రాలకు కట్టేసి చిత్ర హింసలు పెట్టి చంపారు. సీనియర్ పాత్రికేయులు పాశం యాదగిరి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, సీపీఐ, సీపీఎం, బీఆర్ఎస్ నాయకులు జీడి ఎల్లయ్య, బిల్లా తిరుపతిరెడ్డి, సింగారపు రమేష్, పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, తీగల దయాకర్, బస్వ మల్లేశం, చింత రవి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.



విస్నూర్‌లో రాపాక రాంచంద్రారెడ్డి గడి

రాష్ట్రస్థాయి పోటీల్లో రెండో స్థానం

కొడకండ్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి పోటీల్లో మండలంలోని ఏడునూతుల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయస్థానం సాధించినట్లు హెచ్ఎం యాకయ్య తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో ఎస్‌కె.అబ్బాస్ పదవ తరగతి, ఎన్.దుర్గ వర్షిత 9వ తరగతి, ఎండీ ఖతీజా 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.



చెకుముకి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించిన విద్యార్థులు

హత్య కేసులో నిందితుల అరెస్టు

- » ఐదుగురిని రిమాండ్‌కు తరలించిన పోలీసులు
- » నిందితుల్లో 16 ఏళ్ల బాలుడు
- » వివరాలు వెల్లడించిన డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలం దేవరాంపల్లిలో ఈనెల 14న జరిగిన హత్య కేసులో ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు. కాటారం పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం డీఎస్పీ గడ్డం రామ్మోహన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. సీఐ నాగార్జునరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం...

మృతుడు మారపాక సారయ్య (50)తో అతడి తమ్ముడు మారపాక సమ్మయ్య, మరో తమ్ముడు రాజయ్య భార్య లక్ష్మి కుటుంబాల మధ్య ఐదు గుంటల భూవివాదం ఉంది. తల్లిదండ్రులు సంపాదించిన భూమిని అన్నదమ్ములు సమానంగా పంచుకున్నారు. పెద్ద కొడుకునైన తనకు మరో ఐదు గుంటలు ఇవ్వాలని సారయ్య డిమాండ్ చేశాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పెద్ద మనుషుల సమక్షంలో దీనిపై పంచాయతీ జరిగింది. ఈ క్రమంలో సమ్మయ్య రెండు గుంటల భూమిని, లక్ష్మి మూడ గుంటల భూమిని ఇవ్వడానికి అంగీకరించారు. ఒప్పుకున్న ప్రకారం భూమిని స్వాధీనం పర్చాలని సారయ్య ఈ నెల 14న పంచాయతీ పెట్టించాడు. సమ్మయ్య, లక్ష్మి కుటుంబాలు ఆ భూమిని ఇవ్వడానికి ఒప్పుకోలేదు. భూమిని ఇవ్వకుంటే పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వారిని పెద్ద మనుషుల ముందే సారయ్య హెచ్చరించాడు. ఇది మనసులో పెట్టుకున్న సమ్మయ్య, అతడి భార్య స్వప్న, కుమారుడు అంజితోపాటు రాజయ్య భార్య లక్ష్మి, మరో మైనర్ ఐదుగురు కలిసి సారయ్యపై దాడి చేశారు. బైక్‌పై వెళ్తున్న సారయ్య, అతడి కుమారుడు శ్రీరాం కళ్లలో కారం చల్లారు. శ్రీరాం తృటితో తప్పించుకోగా సారయ్యను ఇనుప రాడ్, సుత్తితో కొట్టి గొడ్డలితో నరికారు. దీంతో సారయ్య అక్కడిక్కడే మృతి చెందాడు. ఇది చూసి చుట్టుపక్కల వారు దగ్గరికి రాగా నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు. హత్య సమాచారం అందగానే సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, క్లూస్ టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితులు వస్తువులను సీజ్ చేశారు. మృతుడు సారయ్య కుమారుడు శ్రీరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సోమవారం పోలీసులు మండల కేంద్రం శివారు లోని బొప్పారం క్రాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటో ఎక్కడానికి వచ్చిన నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని స్టేషన్‌లో విచారించారు. భూవివాదంతోనే సారయ్యను హత్య చేశామని నిందితులు ఒప్పుకోగా వారిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించి నిందితులను అరెస్ట్ చేసిన సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, పోలీస్ సిబ్బంది వెంకటేశం, హరికుమార్, లవన్, లక్ష్మిరాజు, ప్రసాద్, తిరుపతి, రఘు, జంపన్నను డీఎస్పీ అభినందించారు.



నిందితుల అరెస్ట్ చూపిస్తున్న కాటారం డీఎస్పీ, సీఐ

వనప్రేమికుడు.. సమ్మయ్య

మొక్కలు నాటడం, సంరక్షణే ఆయన ధ్యేయం

- గోపాలమిత్రగా విధులు.. 25ఏళ్లుగా పర్యావరణ సేవలు
- 35వేలకు పైగా మొక్కలు నాటించి ప్రత్యేక గుర్తింపు



మాజీ మంత్రి సత్యవతి, నూతన వధు వరులతో మొక్కలు నాటిస్తూ (ఫైల్)



ద్విచక్ర వాహనంపై మొక్కతో సమ్మయ్య

ఆదర్శం

నెక్కొండ, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వృక్ష సంపదే ఆయన ప్రాణం.. అందుకు గాను ఎలాంటి ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమం జరిగిన అక్కడికి వచ్చే ముఖ్య అతిథులచే మొక్కలు నాటిస్తుతుంటారు వరంగల్ జిల్లా నెక్కొండ మండలం గుండ్రపల్లి గ్రామానికి చెందిన నల్లొండ సమ్మయ్య ఓ వైపు గోపాలమిత్రగా విధులను నిర్వహిస్తూనే.. 25 ఏళ్లుగా వరంగల్ జిల్లాలో పర్యావరణ పరిక్షణకు కృషి చేస్తూ వనప్రేమికుడిగా గుర్తింపుపొందారు. ఇప్పటి వరకు 35వేలకు పైగా మొక్కలు నాటించిన ఆయన వాటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకునేలా కృషి చేస్తుంటారు. తొలుత నర్సంపేట డివిజన్‌లో.. తరువాత వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటడం ప్రారంభించిన సమ్మయ్య పలు సందర్భాల్లో హైదరాబ్యాద్‌లో జరిగిన కార్యక్రమాల్లోనూ పాల్గొని మొక్కలను నాటాడు. సకల జీవ రాశుల సంక్షేమానికి, కాలుష్య నివారణకు చెట్టు ముఖ్యమనే నినాదంతో ఆయన ఎక్కడ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యక్రమాలు జరిగినా ఆ ప్రాంతాలకు వెళ్లి ప్రముఖులతో మొక్కలు నాటించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు పలువురు ప్రముఖుల నుంచి సత్కారాలు అందుకున్నారు.

పుట్టినరోజులు.. పెళ్లిరోజుల్లో..

ముఖ్యమైన రాజకీయ నేతల, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మొదలు మండలస్థాయిలో ఉన్న ముఖ్యమైన వ్యక్తుల పుట్టిన రోజులు, పెళ్లి రోజులను గుర్తుంచ్యూకొని ఆ రోజున వారితో మొక్కలు నాటిస్తుంటారు సమ్మయ్య అలాగే జాతీయ నాయకుల వర్ధంతి, జయంతుల సందర్భంగా కూడా ఈ కార్యక్రమాలు చేపడుతుంటారు. నాటిన మొక్కలను ఎదిగే వరకు సంరక్షించేందుకు వాటి చుట్టు కంచెలను కూడా ఏర్పాటు చేస్తుంటారు. తనకు వెళ్లేందుకు కుదరకపోతే సదరు ప్రముఖులకు ఫోన్లు చేసి మొక్కలను నాటాలని, సంరక్షించాలని కోరుతుంటారు. సమ్మయ్య నర్సంపేట డివిజన్‌లోని వివిధ గ్రామాల్లో వృత్తి పరంగా గ్రామాలు తిరుగుతూ పశువులకు వైద్య సేవలను అంది స్తుండటమే కాకుండా గ్రామాల్లో నాటిన మొక్కలకు రక్షణ కల్పించి వాటిని వృక్షాలుగా ఎదిగే వరకూ శ్రమిస్తూటాడు.

పలు అవార్డులు అందుకున్న సమ్మయ్య

వన ప్రేమ్యికుడిగా గుర్తింపు పొందిన సమ్మయ్య గ్రీన్ ఇండియా చాలెంజ్, జీవ వైవిధ్య, జాతీయ మహానంది అవార్డు, జై భీమ్ ఫౌండేషన్ పురస్కార్, సోషల్ వర్కర్ ప్రశంసా పత్రం అందుకున్నారు.

ప్రభుత్వం సహకరిస్తే లక్షల్లో మొక్కలు నాటుతా..



మొక్కలు నాటడమే లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ దాదాపు 35వేల మొక్కలు నాటగా, వందల సంఖ్యలో మహావృక్షాలుగా ఎదిగాయి. అయితే 2025 వరకూ 60వేల మొక్కలు నాటుతాను. ప్రభుత్వం తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందిస్తే లక్షల మొక్కలు నాటుతాను.

- నల్గొండ సమ్మయ్య



సమ్మయ్యను నెక్కొండ పోలీసు స్టేషన్‌లో సన్మానిస్తున్న ఏసీపీ తిరుమల్ (ఫైల్)



నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో మొక్కలు నాటిస్తున్న సమ్మయ్య (ఫైల్)

జలేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు

రెడ్డికాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మార్గశిర ఆరుద్ర నక్షత్రం సందర్భంగా సోమవారం హనువకొండ కాకాజీ కాలనీలోని జలేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి విశేష పూజలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



పెద్ద కోవెలలో తిరుప్పావై పాశురాలు చదువుతున్న మహిళలు

వెల్లివిరిసిన ఆధ్యాత్మిక శోభ

- వైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస పర్వం ఆరంభం
- జోరుగా తిరుప్పావై ప్రవచనాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : వైష్ణవ ఆలయాల్లో సోమవారం ఉదయం నుంచి ధనుర్మాస వేడుకలు ప్రారం భమైయ్యాయి. అండాల్ తల్లి అయిన గోదాదేవిని స్తుతిస్తూ గానం చేస్తున్న తిరుప్పావై పాశురాలతో ఆలయాల్లో తెల్లవారు జామునుంచే ఆధ్యాత్మిక శోభ ప్రారంభమైంది. సూర్యోదాయానికి ముందే భక్తులు ముఖ్యంగా మహిళలు ఆలయాలకు చేరుకొని ధనుర్మాస వ్రతసేవల్లో పాల్గొంటూ రోజుకొక్కటి చొప్పున తిరుప్పావై పాశురాలను అను సంధానం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో హనుమ కొండ రెడ్డికాలనీలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో కలకుంట్ల శ్రీనివాసాచార్య తిరుప్పావై ప్రవచనాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ జరిగిన తిరుప్పావై ప్రారంభ వేడుకల్లో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచకులు, సంస్కృత పండితుడు శఠగోపాచార్య, వనం లక్ష్మీకాంతా రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శఠగోపాచార్య మా ట్లాడుతూ పరమ పవిత్రమైన గోదా చరితను శ్రీ వ్రతం పేరిట భక్తి శ్రద్ధలతో నెల రోజులపాటు వ్రతాన్ని ఆచరిస్తే సకల సుఖాలు కలు గుతాయని కోరిన కోరికలు తీరుతాయని శఠగోపాచార్య వ్యాఖ్యానిం చారు. గోదాదేవి ఐదువేల ఏళ్ల కింద తాను ఆచరించి లోకానికి అందించిన 30 పాశురాలే నెల రోజుల తిరుప్పావై పద్యాలని ఆయన చెప్పారు. హనుమకొండ రాగన్నదర్వాజలోని శ్రీ గోదా రంగనాయక ఆలయంలో వైభవంగా ధనుర్మాస వేడుకలు ప్రారంభమైయ్యాయి. ఆల య అర్చకులు కలకోట రామచార్య, నర్సింహాచార్య ఆధ్వర్యంలోజరిగిన ఈ వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ చిన్నకోవెలలో ప్రధాన అర్చకులు చెరుకుపల్లి శ్రీనివాసాచార్య, ఏకశిలా పార్కు అభయాంజనేయస్వామి ఆలయంలో డింగరి శ్రీనివాసాచార్య, రెవెన్యూ రామాలయంలో శ్రీకాం తాచార్య, మిథిల నగర్ బాలసముద్రం కోదండ రామాలయంలో తిరుమలచార్య, ఏ టూ జడ్ వెంకటేశ్వరాలయంలో దేశికన్ స్వామి, దోనగుట్ట లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో పరాంకుశం గిరిధర్‌కృష్ణ, ఎన్‌జీవోస్ కాలనీలో వాసుదేవచార్య, తిరుప్పావై పాశురాలను భక్తులచే అనుసంధానం చేయించారు.

వేయిస్తంభాల ఆలయంలో

ప్రసిద్ధ వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో మార్గశిర మాసంలో ధనుర్మాస వేడుకలు శివప్రీతికర సోమవారం ఇక్కడ లాంఛనంగా ప్రారంభించారు. శాస్త్రానుసారం శివకేశవులను ప్రీతికరమైన మాసం ధనుర్మాసమని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ చెప్పారు. ఈ సందర్భంగా ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని పరమశివునికి లక్ష మారేడుదళాలతో ప్రత్యేక అభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ ఈవో వెంటకయ్య పర్యవేక్షించారు.

లక్ష్మీప్రియకు జాతీయ అవార్డు

హనుమకొండ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరులో అభినయ నృత్యభారతి ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు నిర్వహించిన 29వ జాతీయ నృత్య పోటీల్లో హనుమకొండకు చెందిన పెండ్యాల లక్ష్మీప్రియ జాతీయస్థాయిలో ప్రథమ బహుమతితోపాటు నృత్య కౌముది, బెస్ట్ యూత్ క్లాసికల్ అవార్డును అందుకుంది. ఈ సందర్భంగా ఆమె గురువు బోంపెల్లి సుధీర్‌రావు, లక్ష్మీప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఈమెతోపాటు సుధీర్‌రావు మరో శిష్యురాలు ఆరాధరెడ్డి కూడా జూనియర్ విభాగంలో నృత్య పోటీల్లో ప్రథమ బహుమతి సాధించడం విశేషం.



నృత్య విజేతలను అభినందిస్తున్న నాట్యాచారుడు సుధీర్‌రావు

భూమిలేని పేదలెందరో?

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 28వ తేదీన అందిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. దీంతో వ్యవసాయ కూలీల్లో హర్షం వ్యక్తమవుతోంది.

రూ.12వేల సాయానికి అర్హులెవరు?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీల హామీల్లో వ్యవసాయ కూలీలకు రూ.12వేల ఆర్థిక సాయం ఉంది. దీన్ని ప్రస్తుతం అమలు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయ కూలీలకు ఆర్థికసాయంపై ప్రభుత్వం ప్రకటన కూడా చేయనుంది. అయితే భూమిలేని పేదలను గుర్తించేందుకు ప్రభుత్వం దేనిని ప్రామాణికంగా తీసుకుంటుందనేది చర్చనీయాంశంగా మారింది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ కూలీలను గుర్తించేందుకు ఏ ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించలేదు. 2014లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ఇప్పటి వరకు బయటకు రాలేదు. ఆ రిపోర్టులు ఎక్కడ ఉన్నాయో కూడా ఎవరికి తెలియదు. ఇక ఇటీవల ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో చాలా మంది వాస్తవ వివరాలతో నివేదికలు ఇవ్వలేదనే చర్చ జరుగుతోంది. ఈ రెండు సర్వేల్లో కూడా ప్రత్యేకంగా వ్యవసాయ కూలీలను గుర్తించే కాలం లేదు. ఇక ఉపాధి హమీ జాబ్‌కార్డులను ప్రామాణికంగా తీసుకునే అవకాశం ఉందా అనే చర్చ జరుగుతోంది. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 7.35లక్షల ఉపాధి హమీ జాబ్‌కార్డులున్నాయి. అయితే ఈ కార్డు ఉన్నవారిలో చాలా మందికి ఎంతో కొంత భూమి కూడా ఉంది. ప్రభుత్వం గుంట భూమి ఉన్న కూడా రైతు భరోసా ఇస్తుంది. ఈ పరిస్థితుల్లో జాబ్‌కార్డు ప్రామాణికంగా తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయటం సాధ్యం కాదనే టాక్ వినబడుతుంది. దీంతో రూ.12వేల ఆర్థిక సాయానికి అర్హులు ఎవరనేది ఆసక్తికరంగా మారింది. ఇక ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు చివరి సారిగా 2023-24యాసంగిలో రైతు భరోసా డబ్బులు జమయ్యాయి. జాబ్‌కార్డుదారులకంటే రైతు భరోసా తీసుకుంటున్న రైతులే ఎక్కువగా ఉన్నారు. ఈ లెక్కన ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సుమారు 4లక్షల నుంచి 5లక్షల మంది భూమిలేని పేదలుండే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

రైతు సర్కారు గ్యారంటీ..

ప్రభుత్వం భూమిలేని పేదలకు రూ.12వేల సాయాన్ని అందించేందుకు కసరత్తు చేస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లాకు సుమారు రూ.600కోట్లు కేటాయించాల్సి ఉంటుందని అంచనా. ఉమ్మడి జిల్లాలో 4లక్షల నుంచి 5లక్షల వరకు వ్యవసాయ కూలీలు ఉండగా, ఒక్కొక్కరికి రూ.12వేల చొప్పున రూ.480కోట్ల నుంచి రూ.600కోట్ల వరకు ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాకు కేటాయించాల్సి ఉంటుంది. ఇప్పటికే ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా రెండు విడతల్లో 2,08,077 రైతు ఖాతాలకు సంబంధించి రూ.1,506.50కోట్ల రుణాన్ని ప్రభుత్వం మాఫీ చేసింది. అలాగే 2023-24లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో 8,89,787మంది రైతులకు గత యాసంగిలో రైతుభరోసా సాయం కింద రూ.907.98కోట్లు అందించింది. రైతుభరోసాను సంక్రాంతి నుంచి రూ.10వేల నుంచి రూ.15వేలకు పెంచుతుండటంతో ఈ సాయం రూ.15వేల కోట్లకు పెరగనుంది. ప్రతీ ఏటా రైతు భరోసా, భూమిలేని పేదలకు ఇచ్చే సాయం కలిపి సుమారు రూ.30వేల కోట్ల వరకు రైతులకు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. అయితే వ్యవసాయ కూలీలకు అందించే సాయం మాత్రం రుణమాఫీ తరహాలో కాకుండా అర్హులైన ప్రతీ పేదకు ప్రభుత్వం అందించే రూ.12వేల ఆర్థిక సాయం అందాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. దీంతో అర్హుల ఎంపిక కూడా రాజకీయ విమర్శలు లేకుండా పారదర్శకంగా ఉండాలని, అర్హుల్లో ఒక్కరికి కూడా అన్యాయం జరుగకుండా ఎంపిక ప్రక్రియ ఉండాలని ప్రభుత్వం భావిస్తుందని సమాచారం.



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

50 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు

ఘనంగా కేఎంసీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

వరంగల్ మెడికల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వీరంతా కాకతీయ వైద్య కళాశాలలో 1974వ సంవత్సరంలో వైద్యవిద్యనభ్యసించిన వారు. ప్రస్తుతం ప్రస్తుతం వారంతా వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. అనేక మంది వైద్య రంగంలో ఉన్నత స్థానాల్లో ఉన్నారు. తాము ఇక్కడ చదువుకుని 50ఏళ్లయిన నేపథ్యంలో ఒక్కచోట కలుసుకోవాలని నిర్ణయించుకున్నారు. కాలేజీ క్యాంప్‌లోని ఎన్‌ఆర్‌ఐ హాలులో ఆదివారం సాయంత్రం జరిగిన ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో వరంగల్‌తోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారు హాజరయ్యారు. నాడు తాము చదువుకున్న క్లాస్ రూములు, ల్యాబ్‌లను, చెంబీలు, కుర్చీలను చూసి నాటి అనుభూతులను నెమరువేసు కున్నారు. మున్ముందు పూర్వ విద్యార్థులకుగా తాము కళాశాల అభివృద్ధికి సహకరించాలని నిర్ణయించుకున్నారు. పూర్వ విద్యార్థులు డాక్టర్ పోల నటరాజ్, డాక్టర్ కె.తిరుపతిరెడ్డి, డాక్టర్ ఎ.రవీంద్ర, డాక్టర్ కె.ప్రదీప్‌రెడ్డి ఏర్పాట్లు చేయగా ఈ కార్యక్రమంలో అప్పటి గురువులు డాక్టర్ పి.నరసింహారెడ్డి, డాక్టర్ శేఖర్‌రెడ్డి, డాక్టర్ బుచ్చిరెడ్డి, డాక్టర్ క్రాంతి రావు, డాక్టర్ దామోదర్ కౌశిక్, డాక్టర్ శశికుమార్, డాక్టర్ ఏకనాథం పాల్గొన్నారు.

మార్మోగిన అయ్యప్ప నామస్మరణ

- రంగశాయిపేటలో శబరిమలైని తలపించేలా పడిపూజ
- భక్తులతో కిక్కిరిసిన బీరన్న ఆలయం..



రంగశాయిపేటలో అయ్యప్ప పడిపూజ దృశ్యాలు

శంభునిపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : స్వామియే శరణం అయ్యప్ప.. అంటూ అయ్యప్ప నామస్మరణతో రంగశాయిపేట మార్మోగింది. రంగశాయిపేట, శంభునిపేట అయ్యప్ప సేవా పరపతి సంఘం ఆధ్వర్యంలో రంగశాయిపేటలో గల ప్రసిద్ధ బీరన్న ఆలయంలో సోమవారం అయ్యప్ప మహాపడి పూజ వైభవంగా నిర్వహించారు. ముందుగా రామాలయం నుంచి గురుస్వామి కంచ మల్లయ్య అయ్యప్ప విగ్రహాన్ని ఎత్తుకొని కురుమ కులస్థుల డోలువాయిద్యాలతో శోభాయాత్రగా బీరన్న ఆలయానికి చేరుకున్నారు. గురుస్వామి వెలిదె ప్రదీప్ శాస్త్రి చేతుల మీదుగా అభిషేకాలు నిర్వహించారు. 18 మెట్లపై ఆసీనులైన జ్యోతి స్వరూపిడికి పదులు వెలుగిస్తూ హారతి ఇచ్చారు. నారికేళ గురుస్వామి కళాకారులు కొల్లూరి యోగానంద్ తన పాటలతో బీరన్న ఆలయ ప్రాంగణాన్ని ఉర్రూతలూగించారు. శబరిమలైని తలపించేలా నిర్వహించిన ఈ పడి పూలో సుమారు రెండు వేల మంది భక్తులు పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ వేడుకల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవి, కర్నె రవీందర్, గురుస్వాములు కొల్లూరి యోగానంద్‌తో పాటు బజ్జూరి వీరేశం, కత్తి ఎల్లగౌడ్, అనుమాండ్ల రమేష్, గంగ్రాతి కుమార్, పాల రంజిత్, శేర్ల అనిల్ కుమార్, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి, కుంట శ్రీధర్, అడుప వేణు, కంచ మల్లయ్య, శెంకేశి శ్రీనివాస మూర్తి, బజ్జూరి ప్రభాకర్, సుధాకర్, దయాకర్, దామెరకొండ కర్ణాకర్, కత్తెరపల్లి వేణు, బొల్లెపల్లి సుదర్శన్, రాజశేఖర్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



డోలు వాయిద్యాలతో అయ్యప్ప స్వామిని తీసుకువస్తున్న కురుమ కళాకారులు

కలెక్టర్ సారు.. ఆటలాడారు



సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా సోమవారం జనగామ జిల్లా కేంద్రంలోని ధర్మకంచ మినీ స్టేడియంలో ప్రారంభ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా జ్యోతి ప్రజ్వలన చేసి, జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన క్రీడాకారులతో మమేకమై.. వారితో కలిసి వాలీబాల్, షటిల్, క్రికెట్ ఆడి ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనడమే మొదటి విజయమని, విద్యకు ప్రాధాన్యమిస్తూనే క్రీడల్లో రాణించాలని సూచించారు. విద్యార్థుల మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సీఎం కప్ పోటీలను నిర్వహిస్తోందని, మండల, గ్రామ స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి వచ్చిన క్రీడాకారులు అదే ఉత్సాహంతో రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్ర నాయక్, యువజన మరియు క్రీడల జిల్లా అధికారి వెంకట్‌రెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- జనగామ రూరల్ ఆంధ్రజ్యోతి



గౌరారం వాగులో పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

తాడ్వాయి అడవుల్లోకి పెద్దపులి

భద్రాద్రి జిల్లా వైపు నుంచి మళ్లీ రాక

తాడ్వాయి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ములుగు-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సరిహద్దు అడవుల్లో పెద్దపులి సంచారం భయభ్రాంతులకు గురిచేస్తోంది. మూడు రోజుల క్రితం తాడ్వాయి మండలం పంబాపూర్ అడవుల నుంచి పక్కనే ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలం రఘునాథపాలెం అడవిలోకి ప్రవేశించిన పులి రెండు రోజులు అక్కడే సంచరించింది. సోమవారం మళ్లీ మండలంలోని కాటన్నర్సాపూర్ అడవుల్లోకి వచ్చినట్టు నిర్ధారణైంది. ఇక్కడి గౌరారం వాగులో పులి పాద ముద్రలను గుర్తించినట్టు అటవీ శాఖ రేంజ్ అధికారి సత్తయ్య తెలిపారు. మగపులి తోడు కోసం ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఓ ఆడపులి వచ్చిందని చెబుతున్న అధికారులు దాని కదలికలను ట్రాక్ చేస్తున్నారు.

మంగపేట, కరకగూడెం, గుండాల, తాడ్వాయి అడవులు కలిసి ఉండగా ఐదు రోజులుగా ఇక్కడిక్కడే సంచరిస్తుండటంతో సమీప గ్రామాలు, ఆదివాసీ గూడాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అటవీ ఉత్పత్తుల సేకరణ, పశువుల మేత కోసం అడవుల్లోకి ప్రజలను వెళ్లకుండా నియంత్రిస్తున్న అధికారులు పులి సంచార సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారు.

రహదారులకు మహర్దశ

ఎన్‌హెచ్-30, 63కు
ములుగు జిల్లాలో రెండు రోడ్ల అనుసంధానం

- కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదన
- పర్యాటక, దర్శనీయ ప్రాంతాలను కలిపే ప్రణాళిక
- 50 కిలోమీటర్లు నాలుగు లేన్లుగా విస్తరించే అవకాశం
- ఏటూరునాగారం నుంచి బ్రాహ్మణపల్లి వరకు..
- జంగాలపల్లి నుంచి వెల్తుర్లపల్లి వరకు..

ములుగు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దుతో ఏకైక 163 జాతీయ రహదారిని కలిగి ఉంది ములుగు జిల్లా. మరో రెండు జాతీయ రహదారులతో అనుసంధానం కాబోతోంది. రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయడంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించనున్న ప్రతిపాదనల్లో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలైన రామప్ప, మల్లూరు హేమాచలక్షేత్రాల దారిలో ఏటూరునాగారం-మంగపేట రోడ్డును ఎన్‌హెచ్-30కి, జంగాలపల్లి-వెల్తుర్లపల్లి రోడ్డును ఎన్‌హెచ్-63కు కలుపుతూ అభివృద్ధి చేయాలని పేర్కొంది. త్వరలోనే ఈ ప్రతిపాదనలకు ఆమోదం లభించే అవకాశాలు ఉండగా జిల్లా వాసులు, పర్యాటకులకు రవాణాపరంగా మరింత సౌలభ్యం కలగనుంది.

టూరిజం కారిడార్‌ను కలుపుతూ..

తెలంగాణలోని పర్యాటక, దర్శనీయ ప్రాంతాల అభివృద్ధి కోసం గత కొన్నేళ్లుగా ఆశాజనకంగా అడుగులు పడుతున్నాయి. గత ప్రభుత్వం ప్రకటించిన కాకతీయ టూరిజం కారిడార్ పట్టాలెక్కకపోగా ప్రస్తుత ప్రభుత్వంలో కొంత ఊరట లభించింది. సాస్కీ పథకంలో భాగంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం కాకతీయుల కాలంనాటి ప్రపంచ ప్రఖ్యాత రామప్ప దేవాలయం, గణపురం కోటగుళ్ల అభివృద్ధికి రూ.73.74కోట్ల నిధులను మం జూరు చేస్తూ ప్రకటన చేసింది. ఈ చారిత్రక కట్టడాలతోపాటు చిన్న యాద గిరిగుట్టగా ప్రాచుర్యం పొందిన మంగపేట మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం, వాజేడులోని బొగత జలపాతం, గోవిందరావుపేటలోని లక్నవరం సరస్సు, తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు నిత్యం వేలాదిగా పర్యాటకులు తరలివస్తున్నారు. యునెస్కో గుర్తింపు తర్వాత రామప్ప ఆలయాన్ని తిలకించేందుకు అంతర్జాతీయ పర్యాటకులు బారులుతీరుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ పర్యాటక, దర్శనీయ ప్రాంతాలకు రాకపోకలను సులభతరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అనుసంధానికి ప్రతిపాదించింది.



ఎన్‌హెచ్-63తో అనుసంధానం కానున్న జంగాలపల్లి-పాలంపేట కూడలి



50 కిలోమీటర్ల రహదారి అభివృద్ధి

రాష్ట్ర రోడ్లను జాతీయ రహదారులతో అనుసంధానించే ప్రక్రియలో ములుగు జిల్లాలో 50 కిలోమీటర్ల దూరం నాలుగులేన్లుగా అభివృద్ధి చెందనుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని సారపాక వద్ద ఎన్‌హెచ్-30ని కలుపుతూ ఏటూరునాగారం వరకు 93 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేసే అవకాశముంది. ఈ దారిలో ఏటూరునాగారం ఫారెస్టు చెక్‌పోస్టు నుంచి మంగపేట మండలం బ్రాహ్మణపల్లి వరకు 35కిలోమీటర్ల దూరం అభివృద్ధి చెందుతుంది. అదేవిధంగా జగిత్యాల వద్ద ఎన్‌హెచ్-63నుంచి పెద్దపల్లి, కాల్వశ్రీరాంపూర్, మోరంచపల్లి, పాలంపేట మీదుగా జంగాలపల్లి వరకు 164 కిలోమీటర్ల రహదారిని అభివృద్ధి చేయనుండగా జంగాల పల్లి-వెల్తుర్లపల్లి మధ్య 15 కిలోమీటర్ల దూరం ఫోర్‌లేన్ రహదారిగా మారుతుంది. త్వరగా రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను కేంద్రం ఆమోదించి నిధులు మంజూరు చేయాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



నాలుగు లేన్లుగా అభివృద్ధి చెందనున్న ఏటూరునాగారం-మంగపేట రహదారి

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

10,594 దరఖాస్తుల సర్వే పూర్తి

ములుగు కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ టీఎస్.దివాకర తెలిపారు. ఈనెల 31 నాటికి జిల్లాలో సర్వేను పూర్తిచేసేలా కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు. సోమవారం ఆయన ఇందిరమ్మ ఇళ్ల సర్వే, మొబైల్ యాప్ వినియోగంపై అదనపు కలెక్టర్లు, ఆర్డీవో, ఎంపీడీవోలు, ఎంపీవోలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. నియోజకవర్గానికి మొదటి విడతగా ప్రభుత్వం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని తెలిపారు. ప్రజాపాలన కార్యక్రమంలో 90,863 మంది దరఖాస్తు చేసుకోగా ఇప్పటి వరకు 10,594 దరఖాస్తుల సర్వేను పూర్తిచేసినట్లు చెప్పారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. ప్రతీ దరఖాస్తుపై సర్వే చేయడం జరుగుతుందని, ప్రజలు అపోహకు గురికాకుండా సర్వేకు సహకరించాలని కోరారు. ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శుల వద్ద సందేహాలను నివృత్తి చేసుకోవాలని, దరఖాస్తుదారుల కోసం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కంట్రోల్ రూమ్‌ను 1800-4257109లో సంప్రదించాలని సూచించారు.

టీబీని నియంత్రించాలి : డీఎంహెచ్‌వో

ములుగు, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): టీబీ వ్యాధి నియంత్రణకు వైద్యాధికారులు, సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్‌వో గోపాలరావు సూచించారు. సోమవారం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో టీబీ నియంత్రణపై సమీక్ష జరిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వ్యాధి లక్షణాలున్న వారికి నిరంతరం టీబీ పరీక్షలు జరపాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఎప్పటికప్పుడు పోర్టల్‌లో పొందుపర్చాలని తెలిపారు. మందులను సక్రమంగా పంపిణీ చేయడం ద్వారా రోగుల ఆరోగ్యాన్ని కాపాడాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విపిన్, టీబీ ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్, డాక్టర్ శ్రీకాంత్, ఏఎంవో దుర్గారావు, డీపీపీఎం సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హత్తిరామ్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం ఎదురుగా జరుగుతున్న దీక్షలకు హాజరై ఆయన సోమవారం మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో సమగ్ర ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి పర్మినెంటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రత్నాకర్, కిరణ్మయి, కుమార్, నాగేశ్వర్‌రావు, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్‌ఖరే

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఫిర్యాదులకు పోలీసులు అధిక ప్రాధాన్యమిచ్చి చట్టపరమైన పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎస్పీ ఫిర్యాదులను స్వీకరించారు. వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా దివస్‌లో భాగంగా వివిధ మండలాల నుంచి మొత్తం 16 మంది బాధితులు ఫిర్యాదు చేయగా వారి వివరాలను సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి తెలియపరిచారు. వాటి పరిష్కారానికి తక్షణమే కృషి చేయాలని ఆదేశించారు. ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్దీత సమయంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఎస్పీ సూచించారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కిరణ్ ఖరే

ఓపెన్ కాస్ట్-2లో భద్రతా పక్షోత్సవాలు

కాకతీయఖని, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్ట్-2లో 55వ భద్రతా పక్షోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. సేఫ్టీ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు గనిలో పర్యటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వీయ రక్షణ పాటిస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలన్నారు. సంస్థ మనుగడలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా యాక్టింగ్ జీఎం వెంకట్రామిరెడ్డి, అధికారులు కేహెచ్‌ఎన్ గుప్తా, కృష్ణప్రసాద్, కృష్ణయ్య, నజీర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఆర్టిజన్లకు సేవా రత్న అవార్డు



అవార్డులు అందుకుంటున్న రాజేందర్, నవీన్

గణపురం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేసే ఇద్దరు ఆర్టిజన్లకు సేవా రత్న అవార్డు లభించింది. ఢిల్లీలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బొమ్మకంటి రాజేందర్‌కు సేవా రత్న అవార్డు, ఇనుగాల కుమార్‌కు అంబేద్కర్ నేషనల్ అవార్డులు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ చేతుల మీదుగా అందించారు. కేటీపీపీకి చెందిన ఆయా సంఘాల నాయకులు వారికి అభినందనలు తెలిపారు.

దేవరాంపల్లి వాసికి..

కాటారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగులగూడెం జీపీ పరిధిలోని దేవరాంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ అయిలినేని నవీన్‌రావు బహుజన సాహిత్య అకాడమీ ద్వారా లైఫ్‌టైం అచీవ్‌మెంట్ ఇంటర్నేషనల్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలోని ఆంధ్ర ఆడిటోరియంలో బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్ జరిగింది. ఈ కార్యక్రమంలో బీఎస్‌ఏ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, జాతీయ ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణియన్ ముఖ్య అతిథులుగా హాజరై ఢిల్లీ క్యాబినెట్ మంత్రి ముఖేష్‌కుమార్, కరోల్‌బాగ్ ఎమ్మెల్యే విశేష్‌రవి సమక్షంలో నవీన్‌రావుకు అవార్డు ప్రదానం చేశారు.

సామాజిక తనిఖీ బృందం పర్యటన

మహదేవపూర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : మండలంలో మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు నిర్వహించిన రూ. 4.44 కోట్ల పనులకు సంబంధించి ఎస్‌ఆర్‌పీ నాగరాజు ఆధ్వర్యంలో తనిఖీ బృందం మండలానికి విచ్చేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని 18 జీపీల్లో చేపట్టిన పనులను మూడు రోజుల పాటు ప్రత్యక్షంగా తనిఖీ చేసి అవకతవకలను గుర్తించి ప్రజా వేదికలో చదివి వినిపించనున్నట్లు ఆయన తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వెంకటాపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించినట్లు ములుగు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు మెనేజర్ రమేష్ తెలిపారు. సోమవారం వెంకటాపూర్ మండలంలోని సింగరకుంటపల్లి గ్రామంలో రైతులకు కళాజాత బృందంతో కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ పంట రుణాలు, మహిళా సంఘాల రుణాలు, గోల్డ్‌లోన్స్, డిపాజిట్స్, ప్రైవేటు అధిక వడ్డీ, సైబర్ నేరాలు, కేంద్ర ప్రభుత్వం అందించే బీమా పథకాలు తదితర అంశాలపై కళా ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించినట్లు తెలిపారు.

తప్పిపోయిన వ్యక్తి ఆచుకీ లభ్యం

మేడారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనగామ జిల్లా చిల్పూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన గోనెల అనిల్ కుమార్ నాలుగు రోజుల క్రితం శుక్రవారం ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతల దర్శనానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి పరిసరాల్లో తప్పిపోయారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు చేశారు. పరిసర గ్రామాల్లో గాలించారు. సోమవారం సాయంత్రం వెంగళాపూర్‌లో పోలీసులకు అతడి ఆచూకీ లభించింది.

వీరాపూర్ మల్లన్న బోనాలు

కాటారం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరాపూర్‌లో మల్లికార్జునస్వామి బోనాల జాతర సోమవారం వైభవంగా జరిగింది. గ్రామ శివారులోని మల్లన్నఆలయం ఎదుట ఒగ్గు కళాకారులు పెద్ద పట్నాలు వేశారు. అనంతరం శివసత్తులు, లక్ష్మీదేవరలు డోలువాయిద్యాలు, డప్పుచప్పుళ్ల మధ్య పూనకాలతో పట్నాలు తొక్కుతూ భక్తులకు భవిష్యవాణి వినిపించారు. మహిళలు నైవేద్యంతో కూడిన బోనాలను వండి సాయంత్రం ఆలయ ప్రదక్షిణ చేసి మల్లన్నకు సమర్పించారు. పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు జాతరలో పాల్గొని మల్లన్న దేవుడికి మొక్కుకున్నారు. పలు గ్రామాల నుంచి జాతరకు వందలాది మంది భక్తులు హాజరై తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో వీరాపూర్, ఒడిపిలవంచ, బయ్యారం మాజీ సర్పంచులు వేమునూరి రమేష్‌రెడ్డి, కోడి రవికుమార్, చినాల బ్రహ్మారెడ్డి, గ్రామపెద్దలు, జాతర నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలి

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని టీవీఏసీ జేఏసీ కన్వీనర్ మోత్కూరి కోటి ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 18న ఉదయం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఆందోళన కార్యక్రమం ఉంటుందని, ఇందులో పాల్గొనాలని కోరారు.

మెడిటేషన్‌తో మానసిక ధృడత్వం

చిట్యాల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మెడిటేషన్‌తో మానసిక ఒత్తిడి తొలిగి మానసిక ధృడత్వం పెరుగుతుందని హార్ట్‌ఫుల్‌నెస్ లైఫ్ ఎక్స్‌పీరియన్స్ ప్రొటెన్షియల్ ప్రోగ్రాం జిల్లా నోడల్ కోఆర్డినేటర్ లక్ష్మణ్ అన్నారు. ఇంటర్మీడియట్ ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రోగ్రాం కోఆర్డినేటర్లు రవీందర్, గంగధరాచారి, సమ్మయ్య మెడిటేషన్ చేయించారు. విద్యార్థులు వనసిక రుగ్మతలను జయించి అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించే మెడిటేషన్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, లెక్చరర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ సర్వేను పకడ్బందీ నిర్వహించాలి : డీపీవో

కాటారం, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి) :గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీఎల్‌పీవో వీరభద్రయ్య పంచాయతీ అధికారులను ఆదేశించారు. మండలంలోని కాటారం గ్రామపంచాయతీ పరిధిలో డీఎల్‌పీవో సోమవారం పర్యటించారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని కార్యదర్శి సమీర్‌ఖాన్‌ను ఆదేశించారు. జీపీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల వివరాలను తెలుసుకున్నారు. 2160 దరఖాస్తులు వచ్చాయని, ప్రస్తుతం ఒక లాగిన్ ఇచ్చారని కార్యదర్శి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వాజేడు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వాజేడు, వెంకటాపురం మండలాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏడీఏ అకిటి స్వామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాపురం మండల కేంద్రంలోని 132/33 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు ఉన్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

బేస్‌బాల్ జట్ల ఎంపిక

కాటారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపల్లి గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల క్రీడామైదానంలో సోమవారం బేస్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక ఘనంగా జరిగింది. సీఎం కప్-2024 రాష్ట్రస్థాయి బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొననున్న భూపాలపల్లి జిల్లా మెన్, ఉమెన్ జట్ల ఎంపిక బేస్‌బాల్, సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ మంచిక నర్సింహారామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 200 మందికి పైగా క్రీడాకారులు హాజరు కాగా ఈ మేరకు ఆదివారం వెల్లడించారు. పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారుల నుంచి ఈ నెల 18-21వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల కోసం జిల్లా జట్లను ఎంపిక కమిటీ సభ్యులు వీరగోని రాజు, వీరన్న, పూర్ణిమ ఎంపిక చేశారు. బేస్‌బాల్ మహిళా జట్టులో అనూష(కెప్టెన్), ఐశ్వర్య, సుచరిత, నాగలక్ష్మీ, పావని, అక్షిత, జ్యోత్స్నశ్రీ, శ్రీలేఖ, సంజన, అంజలి, ప్రణీత, సాయికీర్తన, కళ్యాణి, రిత్విక, ప్రణవి, శ్వేత, అపర్ణ, కావ్య ఎంపికయ్యారు. పురుషుల జట్టులో అయాన్స్(కెప్టెన్), రాజు, మనోజ్, రాహుల్, సమీర్, ప్రశాంత్, వినయ్, అక్షయ్, శ్యామ్, రజాకర్, అభిరాం, కార్తీక్, హుస్సేన్, అక్షిత్‌కుమార్, అనీప్, శివరాజ్, సాయివెంకటవర్షిత్, మణికంఠ ఎంపికైనట్లు కమిటీ సభ్యులు వీరన్న, రాజు, పూర్ణిమ తెలిపారు. ఇరు జట్ల కోచ్‌లుగా శైలజ, పూర్ణిమ, మేనేజర్లుగా తిరుపతి, రాజు వ్యవహరించనున్నట్లు జిల్లా అసోసియేషన్ చైర్మన్ నరసింహరామయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల టీచర్ శివలక్ష్మి, అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అభినవవినయ్, సంయుక్త కార్యదర్శి తిరుపతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన బేస్‌బాల్ మహిళాజట్టు

ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లు పరిశీలన

కాకతీయఖని, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న జరగనున్న సింగరేణి ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లను భూపాలపల్లి ఏరియా ఎస్‌వోటూ జీఎం కవీంద్ర సోమవారం పరిశీలించారు. స్థానిక అంబేద్కర్ క్రీడామైదానంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆయన వెంట అధికారులు రవికుమార్, మారుతి, బాలరాజు, కాంత్రికుమార్, శ్రావణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

భక్తులకు మామిడి మొక్కల పంపిణీ

మహాదేవపూర్, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర, ముక్తేశ్వర ఆలయానికి వచ్చే భక్తులకు సోమవారం ఫారెస్టు శాఖ అధికారులు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. ఫారెస్టు రేంజర్ రవి ఆధ్వర్యంలో మొక్కలను పంపిణీ చేస్తు అడవిలో నిప్పు పెట్టడం వల్ల కల్గే అనర్థాల గురించి భక్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ ఆనంద్, సిబ్బంది పాల్గోన్నారు.

ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

మహాదేవపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మందరగిరి వెంకటేశ్వర స్వామి ఆయలం, కాళేశ్వరంలోని కోదండ రామాలయంలో ధనుర్మాస ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వైష్ణవ సంప్రదాయం ప్రకారం ప్రతి రోజూ తిరప్పావై పాశురాల పారాయణం జరగనుంది. నెల రోజుల పాటు ధనుర్మాస ఉత్సవాలు ఆలయాల్లో సాగనున్నాయి.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్ల పంపిణీ

మహాదేవపూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): హుజురాబాద్‌కు చెందిన గంగిశెట్టి మధురమ్మ మెమో రియల్ ట్రస్టు వారు సోమవారం మండలంలోని ప్రభుత్వ పాఠ శాలల్లోని 336 మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కాళేశ్వరం ఉన్నత పాఠశాలలో 160 మంది విద్యార్థులకు, ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల(బాలికలు) 72, మహాదేవపూర్ ఉన్నత పాఠశాల (బాలికలు) 74, బొమ్మాపూర్ ఉన్నత పాఠశాలలో 12, అంబటిపల్లిలో 17 మంది విద్యార్థులకు ట్రస్టు నిర్వాహకులు గంగిశెట్టి జగదీశ్వర్ అందించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు అన్నపూర్ణ, సునీత, సరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాయ మాటలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ : బీజేపీ

మంగపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మాయ మాటలు చెప్పి సాధ్యం కాని హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ నాయకులను, ప్రజాప్రతినిధులను నిలదీయాలని బీజేపీ జిల్లా కార్యదర్శులు కొత్త సుధాకర్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ బూత్ కమిటీల పరిశీలనలో భాగంగా పార్టీ సమావేశం మండల సహయోగి రావుల జానకీరావు అధ్యక్షతన మంగపేటలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల హామీలను ఇచ్చి ఒక్కటి కూడా సరిగా అమలు చేయకుండా మోసం చేస్తోందని విమర్శించారు. బీజేపీ మండల కార్యదర్శి నిడుదవోల శ్రీనివాస్, సీనియర్ నాయకులు రామిడి సురేష్, బల్లికొండ రాంబాబ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో ఆదివాసీలకు అన్యాయం

ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారెంటీల పేరుతో ఆదివాసీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మోసం చేస్తోందని, ఏజెన్సీ చట్టాలను తూట్లు పొడుస్తోందని బీజేపీ అనుబంధ ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్ ఆరోపించారు. మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం, రామన్నగూడెంలో బీజేపీ పార్టీ బూత్ కమిటీలను ఆయన ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం దండయాత్ర కొనసాగిస్తోందని విమర్శించారు. ఆదివాసీ గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా ప్రజా పాలన పేరుతో రాజ్యాంగానికి తూట్లు పొడుస్తోందని మండిపడ్డరు. ఏజెన్సీ ప్రాంతాలలకు విరుద్ధంగా జాబ్ నోటిఫికేషన్లు రిలీజ్ చేస్తున్నారని, ఏజెన్సీ ప్రాంతాల భూములపై తప్పుడు కేసులు బనాయించి ఆదివాసీ ప్రజలను రాష్ట్ర ప్రభుత్వం చాలా ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా ములుగు జిల్లా అధ్యక్షుడు గండపల్లి సత్యం, ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వావిలాల జనార్ధన్, జిల్లా కార్యదర్శి వినుకోలు చక్రవర్తి, మండల ప్రధాన కార్యదర్శి కర్నే సంపత్, గద్దల ప్రణయ్, బొల్లె శ్రీనివాస్ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, వైద్యాన్ని అందించాలి

ఏటూరునాగారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సబ్బండ వర్గాల ప్రజలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం ఉపాధి అందించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ గొర్రెపాటి తరుణ్ అన్నారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరాహార దీక్షకు దిగారు. ఈ సందర్భంగా తరుణ్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజల అవసరాలను ప్రతిపాదిస్తూ ప్రభుత్వం అందించాల్సిన ఐదు ముఖ్యమైన గ్యారెంటీలను ముందుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్య వైద్యం, ఉపాధి అవకాశాలు, ఒక ఎకరం సాగు భూమి, రేషన్ కార్డు ఉన్న ప్రతి పేద కుటుంబానికి 200 గజాల గృహ నిర్మాణం కోసం స్థలం కేటాయించాలన్నారు. ఆరు గ్యారెంటీల పేరుతో రాష్ట్రం మెజారిటీ కులాల ప్రజలకు న్యాయం చేయడంలేదని మిమర్శించారు. ఐదు గ్యారెంటీల కోసం పోరాటం తుది దశ వరకు కొనసాగుతుందని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ దీక్ష కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రీజినల్ ఇన్‌చార్జ్ మేకల సుమన్ మహరాజ్, రాష్ట్ర కార్యదర్శి మనోహర్, జిల్లా సీనియర్ నాయకులు సురేష్ మహరాజ్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభల ద్వారానే ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయాలి

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి కుమార్

ఏటూరునాగారం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికను గ్రామ సభల ద్వారానే చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారి రవి కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాల హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటుతున్నప్పటికీ లోటు బడ్జెట్ అనే పేరుతో సంక్షేమ పథకాల అమల్లో అలసత్వం వహిస్తోందని విమర్శించారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని బస్సుల సంఖ్యను పెంచాలని ఆయన కోరారు. ఎలాంటి తరుగు లేకుండా సన్నధాన్యం కొనుగోలు చేయాలని, రైస్ మిల్లర్లు ములుగు జిల్లాలో అక్రమంగా ఐదు నుంచి పది కిలోలు కోత విధిస్తున్నారని తెలిపారు. ధాన్యం కోతలు విధించడం తెలంగాణ రాష్ట్రంలో ఏ జిల్లాలో లేకపోయినా ములుగు జిల్లాలో మాత్రం రైస్ మిల్లర్లు ప్రభుత్వం, అధికారులతో కుమ్మక్కు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ధాన్యం కోతలపై రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టి సారించాలని, రైతులందరికీ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేయాలన్నారు. అదేవిధంగా అటవీహక్కు పత్రాలపై రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఎం ములుగు జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ, జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎమ్డీ. దావూద్, సీపీఎం, సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు చిట్టిబాబు, కుమ్మరి శ్రీను, ఎమ్డీ. గఫూర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతన్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు రవి కుమార్

తడుందెబ్బ మండల కమిటీ ఎన్నిక

కన్నాయిగూడెం, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) సమావేశం సోమవారం మండల కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అథిది గా ఆ సంఘం జాతీయ కో కన్వీనర్‌లు పొడెం రత్నం ,యాసం రాజు హాజరయ్యారు. అనంతరం కన్నాయిగూడెం మండల కమిటీని ఎన్నుకున్నారు.

మండల అధ్యక్షుడిగా ఆలం రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శిగా రాయికంటి కిరణ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చింత సోమరాజు, ప్రచార కార్యదర్శి కాపుల సమ్మయ్య, ఉపాధ్యక్షుడు పాయం జనకీరాం, పొడెం నర్సింహరావు, సిద్ధబోయిన సర్వేశ్వర్‌రావు, సోలం సురేష్, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు కోడె రవి తదితరులు పాల్గొన్నారు.